ప్రజాశక్తి
మంగళవారం 16 డిసెంబర్ 2025
5
విజయనగరం



ఫిర్యాదుల పరిష్కారంపై ఆడిట్ టీమ్‌కు శిక్షణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పిజిఆర్ఎస్‌కు వచ్చే వినతుల పరిష్కారంపై ఆడిట్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కి వచ్చే ఫిర్యాదులపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రీ ఓపెన్ కేసులు, ప్రీ ఆడిట్, ఆడిట్, ప్రజల సంతృప్తి, తదితర అంశాలు కచ్చితంగా ఉండాలని, అందుకోసం మరోసారి శిక్షణ ఇవ్వాలని అన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, గడువు దాటినవి, రీ ఓపెన్ అయిన వాటిపై సమీక్షించారు. క్వాలిటీ డిస్పోజల్ జరగాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు వినతుల పరిష్కారంపై పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సమావేశంలో జెసి సేధు మాధవన్, డిఆర్ఒ మురళి, వివిధ శాఖల అధికారులు, ఆన్‌లైన్ ద్వారా మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

విన్నపాలు వినవలె

- పిజిఆర్ఎస్‌కు వెల్లువెత్తిన వినతులు
- వ్యక్తిగత సమస్యలపై కొందరు... సామూహిక సమస్యలపై మరికొందరు
- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదంటూ ఆవేదన

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విన్నపాలు.. వినవలె.. వింతవింతలూ అన్నట్టుగా రకరకాల సమస్యలతో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజానీకం కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు తరలి వచ్చారు. వీరిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై వినతులు, ఫిర్యాదులు అందజేయగా, మరికొందరు సామూహిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎక్కువగా రెవెన్యూ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు, సంస్థలకు సంబంధించిన వినతులు అందాయి. కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, జెసి సేధుమాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిఆర్‌డిఎ పీడీ వినతులను స్వీకరించారు. మొత్తంగా 185 వినతులు, ఫిర్యాదులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 60, డిఆర్‌డిఎ సంబంధించి 32 చొప్పున ఉన్నాయి. గ్రామ సచివాలయ శాఖకు సంబంధించి 11 వినతులు, మున్సిపల్ శాఖ -5, విద్యా శాఖ సంబంధించి 1, జిల్లా పంచాయతీ శాఖ - 18, విద్యుత్ శాఖ - 4, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ- 1, డిసిహెచ్ఎస్ -1, హౌసింగ్ - 10, ఇతర శాఖలకు సంబంధించి మరో 42 అందాయి. వీటిలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే...

వయసు నిర్ధారణలో జాప్యం తగదు

వయసు నిర్ధారణ పత్రాల్లో అధికార యంత్రాంగానికి ఏమాత్రమూ జాప్యం తగదు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా 3వేల మంది వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇందుకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోండి. సర్వజన ఆసుపత్రి పరిపాలన అధికారులు, వైద్యులు ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇదే విషయమై పిజిఆర్ఎస్‌కు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు.

- శీరాపు శ్రీనివాసరావు, ప్రశాంతినగర్, దాసన్నపేట, విజయనగరం

పిఎం కిసాన్ వర్తింపజేయండి

నా పేరిట 47 సెంట్ల భూమి రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఆన్‌లైన్ ద్వారా 1బి అడంగల్ కూడా వస్తోంది. ఏళ్ల తరబడి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయం పొందుతున్నాను. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ నగదు కూడా నా బ్యాంకు ఖాతాలో పడింది. పిఎం కిసాన్ డబ్బులు నాకు ఇటీవల అందలేదు. మండల స్థాయిలో వినతులు అందజేసినా ఫలితం లేకపోయింది. నాకు న్యాయం చేయండి.

- శీర గోపాలకృష్ణ, చినబంటుపల్లి, మెరకముడిదాం మండలం

పనిదినాలను 200 రోజులకు పెంచాలి

విజయనగరంటౌన్ : ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానించి, పని దినాలు 200 రోజులకు పెంచాలని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల ఐక్యవేదిక నాయకులు పిజిఆర్ఎస్‌లో వినతి అందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, లాయర్ కరీం, రొంగలి రామారావు, ఇప్పిలి వెంకట రామారావు, దిమిలి పైడిరాజు, టి.వి.దుర్గారావు, పి.షణ్ముఖరావు, పి వెంకటేష్ పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

పదేళ్ల క్రితం ఏర్పాటుచేసిన టీచర్స్ కాలనీలో రోడ్లు, కాలువలు, నీటి సదుపాయం లేదు. వర్షాకాలం, వేసవిలో తీవ్ర అవస్థలు పడుతున్నాం. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించకపోతే ఎలా? ఇది ఎంత వరకు సమంజసం. పదేళ్లుగా ఫిర్యాదులు చేస్తూనే ఉన్నాం. అయినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించండి.

- ఎంవి.రమణమూర్తి, టీచర్స్ కాలనీ, ఎస్.కోట

జీడి, మామిడి బీమా చెల్లించండి

2024-25 రబీ సీజన్‌లో వాతావరణ సమతుల్యత దెబ్బతినడం, అకాల వర్షాలు, చీడపీడలు వంటి కారణాల వల్ల జీడి, మామిడి, అపరాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు ఇప్పటి వరకు ఎవరికి ఎంత నష్టం జరిగిందో ప్రకటించలేదు. ఇప్పటికైనా బీమా సదుపాయం పొందిన వారికి సంబంధిత బీమా కంపెనీ నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకోండి.

- బి.రాంబాబు, ఎల్.ఆదినారాయణమూర్తి, గొంప కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, నాయకులు

మా పంచాయతీ ఎస్‌సి రిజర్వు చేయండి

రానున్న సర్పంచ్ ఎన్నికల్లో మా పంచాయతీ ఎస్‌సి రిజర్వు చేయండి. పంచాయతీలో 2500 జనాభా ఉండగా 350 మంది (15శాతం) ఎస్‌సిలు ఉన్నారు. 1600 మంది ఓటర్లు ఉండగా 300 వరకు (20 శాతం) దళితులే ఉన్నారు. కానీ, 1959 నుంచి నేటి వరకు జరిగిన ఒక్క ఎన్నికలో కూడా ఎస్‌సి రిజర్వు కాలేదు. ఈ నేపథ్యంలో తరతరాలపాటు ఇతర సామాజిక తరగతి ఏలుబడిలోనే ఉన్నాం. అసలే మా గ్రామం అత్యంత వెనుకబడిన ప్రాంతం. అందులోనూ దళితవాడ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది.

- శివడవలస గ్రామస్తులు, బొబ్బిలి మండలం

'సుజల స్రవంతి' డిజైన్ మార్చాలని ధర్నా

ధర్నా చేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

సుజల స్రవంతి డిజైన్ మార్పు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు ఆధ్వర్యాన గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, గుర్ల మండలాల పోలవరం కాలువ బాధిత రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బొండపల్లి మహిళా సభలో, మంత్రి లోకేశ్ గంట్యాడ సభలో ఎలైన్ మెంట్ పరిశీలించి ప్రత్యామ్నాయం పరిశీలిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినా యధావిధిగా భూసేకరణకు పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే ఎలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి వినతి అందించారు. రైతుల వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, దీనిపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోలవరం ఎడమ కాలువ పోరాట కమిటీ కోకన్వీనర్ బోదంకి అప్పలనాయుడు, ఎపి రైతుసంఘం గంట్యాడ మండల అధ్యక్షులు కె.శ్రీను, సాగి రవి, చల్ల పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందించారు. అధికారుల అలసత్వం వల్ల రైతులు మద్దతుధర పొందలేక తీవ్రంగా నష్ట పోతున్నారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కోశాధికారి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

తాబేదారుల కోసమే పిపిపి

- వైసిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వ వైద్య కళాశాలలుగా ఉంచుతాం
- జిల్లాలో 4.50 లక్షలకు పైగా సంతకాల సేకరణ
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

'టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రజా ప్రయోజనాలను పక్కన పెట్టి 'నాకింత.. నీకెంత' అనే విధానంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగానే పిపిపి పేరిట తాబేదారులకు, అనుయాయులకు ప్రభుత్వ వైద్య కళాశాలలను కట్టబెట్టాలని చూస్తోంది..' అంటూ శాసనమండలి ప్రతిపక్ష నేత, వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ... ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. వైసిపి అధికారంలోకి రాగానే ప్రభుత్వ వైద్య కళాశాలలుగా మళ్లీ పునరుద్ధరిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి జిల్లాలో చేపట్టిన సంతకాల సేకరణ ప్రతులను ఆ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించే కార్యక్రమాన్ని ప్రజా చైతన్య ర్యాలీ పేరిట సోమవారం నగరంలో నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని బొత్స ప్రారంభించారు. సిఎంఆర్ జంక్షన్ నుంచి ఎన్‌సిఎస్, కన్యకా పరమేశ్వరి కోవెల, గంటస్తంభం మీదుగా కార్పొరేషన్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.2.66 లక్షల కోట్లు అప్పు చేసిందని, పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.5 వేల కోట్లు ఎందుకు ఖర్చు చేయలేక పోతోందని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జిల్లాలో 4.50 లక్షల సంతకాలు సేకరించినట్లు తెలిపారు. వీరంతా రాబోయే రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయనున్నారని చెప్పారు.

ర్యాలీలో పాల్గొన్న వైసిపి శ్రేణులు

మరోవైపు రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తి పూర్తిగా తగ్గిపోయిందని, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతితో కూరుకుపోయాయని తెలిపారు. రాష్ట్రంలో అత్యాచారాలు, పిల్లల కిడ్నాప్‌లు, హత్యలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరని విమర్శించారు. కూటమి నాయకత్వంలో పటుత్వం, అధికారుల మీద అజమాయిషీ లేకపోవడమే అందుకు కారణమని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, వైసిపి రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పిజిఆర్ఎస్‌కు 25 అర్జీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 25 అర్జీలు అందాయి. వాటిని అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత స్వీకరించి, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను వివరించారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ కె.కుమారస్వామి, ఎస్ఐ ప్రభావతి పాల్గొన్నారు.

ఇడిగా విజయగీత

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జి.విజయగీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌టిసి కేంద్ర కార్యాలయంలో మార్కెటింగ్ చీఫ్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆమె ఇడిగా బాధ్యతలు చేపట్టారు. ఆమెకు జోన్-1 అధికారులు, సూపర్‌వైజర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

21న పల్స్ పోలియో

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,99,386 మంది పిల్లలకు 1171 పోలియో బూతుల్లో పల్స్ పోలియో చుక్కలను వేయడానికి ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు 20 ట్రాన్సిట్ బృందాలు, 66 సంచార బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. మురికివాడలు, మత్స్యకార గ్రామాలు, వలస కార్మిక ప్రాంతాలు, నిర్మాణ స్థలాలు, ఇటుక బట్టీలు వంటి 125 హైరిస్క్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం 2.43 లక్షలకు పైగా డోసులు అవసరమని, 56 కోల్డ్ చైన్ యూనిట్లు సిద్ధం చేశామని వివరించారు. ఏదైనా కారణాల వల్ల ఆ రోజు పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలకు ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, వంద శాతం పోలియో చుక్కలు వేయడం పూర్తి చేయాలని ఆదేశించారు. సుమారు ఐదు వేల మంది సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 20వ తేదీకి పోలియో వ్యాక్సిన్ కిట్లు బూత్‌లకు చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ మురళి, డిఎంహెచ్ఒ జీవనరాణి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఐసిడిఎస్ పీడీ విమలరాణి, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, మెప్మా పీడీ చిట్టిరాజు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు రెడ్డి శంకరరావు

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

కోట జంక్షన్‌లో యూనియన్ జెండావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ నాయకులు రెడ్డి శంకరరావు, ఎ.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. సిఐటియు జాతీయ మహాసభ సందర్భంగా స్థానిక కోట జంక్షన్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఆ యూనియన్ జెండాను రెడ్డి శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మిక హక్కులు, చట్టాల కోసం దేశ వ్యాప్తంగా పోరాడిన చరిత్ర కలిగిన సంఘం సిఐటియు అన్నారు. అలాంటి సిఐటియు జాతీయ మహాసభ విశాఖపట్నంలో తొలిసారి జరగనుందని తెలిపారు. అందులో భాగంగా జనవరి నాలుగో తేదిన విశాఖ బీచ్‌లో వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.రమణ, బి.పాపారావు, ఆటో, కళాసీ కార్మికులు పాల్గొన్నారు.

అవయవదానం.. సైనికుల సేవలతో సమానం

తిరుమల - మెడికవర్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అవయవదాత కుటుంబీకులను సత్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అవయవ దానం దేశ సైనికుల సేవలతో సమానమని ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అటువంటి అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు. ఇటువంటి సేవలు తిరుమల - మెడికవర్ ఆసుపత్రిలో అందించడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఆసుపత్రి ఎమ్‌డి డాక్టర్ తిరుమల ప్రసాద్ ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తున్నారని కొనియాడారు. ఆసుపత్రిలో ఇటీవల తొలిసారిగా కిడ్నీ మార్పిడి జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల అవయవ దానం చేసిన కుటుంబీకులను అభినందించడంతోపాటు మృతులను స్మరించుకునేందుకు తిరుమల - మెడికవర్ ఆసుపత్రిలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ విజయనగరంలో తొలిసారిగా కిడ్నీ మార్పిడి చేసిన ఘనత తిరుమల ప్రసాద్‌కే దక్కుతుందన్నారు. అంతకు ముందు టెలిస్కోప్ సర్జరీలు కూడా చేశారని కొనియాడారు. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి అవయవాలను దానం చేసేందుకు సంబంధిత కుటుంబ సభ్యులు ముందుకొస్తే ఎనిమిది మంది ప్రాణాలను కాపాడినట్టేనని అన్నారు. మారుతున్న ప్రపంచంలో మూఢనమ్మకాలను వీడి, అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. ఇందుకు కోసం వైద్యులు, వైద్య విద్యార్థులతోపాటు ప్రతిఒక్కరూ ప్రచారం చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు మాట్లాడుతూ స్థానికంగా అవయవ మార్పిడికి తగిన టెక్నాలజీ, నైపుణ్యం గల వైద్యులు ఉండడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవలు అందుబాటులో ఉండడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానానికి ఇటీవల విరివిగా ముందుకు వస్తున్నారని వివరించారు. వారికి ప్రభుత్వం సైతం తగిన ప్రోత్సాహం, గుర్తింపు ఇస్తోందని వివరించారు. అవయవాలను తొలగించిన పార్థీవదేహాన్ని తహశీల్దార్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రభుత్వం జిఒ నెంబర్ 65 జారీచేసిందని అన్నారు. ఇందుకోసం సహకరించిన వారిని కలెక్టర్ స్థాయి అధికారులు కలిసి పరామర్శించడంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. అవయవదానం చేసిన వారిని ప్రభుత్వంతోపాటు కొంతమంది సినీ ప్రముఖులు కూడా కలిసి అభినందించినట్లు గుర్తుచేశారు. డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ అవయవదానానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. అవయవ మార్పిడికి అవసరమైన టెక్నాలజీ, నైపుణ్యం గల వైద్యులు తమ ఆసుపత్రిలో నిరంతరం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే అవయవదానానికి సహకరించిన వారిని, అవయవ మార్పిడిలో సహరించిన వైద్యులను మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా శాలువాలు కప్పి సత్కరించారు. తిరుమల మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ మల్లికార్జునరెడ్డి, వైద్యులు జగదీష్, సూర్యనిహార్, సుధీర్ నాయుడు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు వెలుగునిద్దాం

ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇంధన పొదుపు పాటించి భవిష్యత్ తరాలకు వెలుగునిద్దామని కలెక్టర్ రామసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ పొదుపు అనేది ఒక బాధ్యతగా చూడాలన్నారు. విద్యుత్ పొదుపు పాటించడం ద్వారా మనం సమాజానికి ఎంతో మేలు చేసిన వారమవుతామన్నారు. అవసరం మేరకు లైట్లు, ఫ్యాన్లు వినియోగించాలన్నారు. అనంతరం వారోత్సవాలు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.త్రినాథరావు, రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌బాబు, డిఇలు, ఎఇలు, విద్యుత్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి, అధికారులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అమరజీవి పొట్టిశ్రీరాములుకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని జెసి ఎస్.సేధుమాధవన్ సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు తెలుగుజాతికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్ఒ మురళి, ఎస్‌డిసిలు రాజేశ్వరి, వెంకటేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : జిల్లా పోలీసు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, సిఐలు సత్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్, బి.లలిత పూలమాల వేసి, నివాళులర్పించారు.

విజయనగరం టౌన్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబటివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రముఖ వ్యాపార వేత్త బత్తుల కామేష్ ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు చెరుకూరి నాగరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ మాటూరు శ్రీనివాసరావు, అవోపా అధ్యక్షులు బండారు చంద్రశేఖర్, యువజన సంఘం అధ్యక్షులు ఎ.సందీప్, డిమ్స్ రాజు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. విజయనగరం కళాశాల అధ్యక్షులు డాక్టర్. కె.రేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఐక్యూఎస్సి కోఆర్డినేటర్ డాక్టర్ జైపాల్‌రావు, వైస్ ప్రిన్సిపల్ డి.అప్పారావు, రమా గీతాదేవి, మాధురి, కరోతు శ్రీనివాసరావు, రాఘవ, గేదెల సుశీల పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయ నిర్వాహకులు దామోదర్ శ్రీధర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక మహాత్మా గాంధీ పార్క్ ఆవరణంలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాసవి యూత్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, డిప్యూటీ ఎంపిడిఒ కె.గాయత్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఒ కామేశ్వరరావు, ఎపిఎం జగదీష్, సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. సిబ్బంది దృష్టికి వచ్చిన ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కారం దిశగా చొరవ చూపాలని ఆదేశించారు.

సర్వేకు సహకరించండి

ప్రజల కచ్చితమైన స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. సోమవారం మెప్మా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన సచివాలయ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే చేపడుతోందని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి శతశాతం సమాచారం సేకరించే దిశగా సర్వేను విజయవంతం చేయాలని సూచించారు. జనవరి 12వ తేదీ వరకు ఈ తరహా సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఒ సీతారామమూర్తి పాల్గొన్నారు.

జెన్ ఎఐ హ్యాక్‌థాన్‌లో సీతం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-విజయనగరం

జెఎన్‌టియు-జివి, జెన్ ఎఐ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జెన్ ఎఐ హ్యాక్‌థాన్ ఫర్ నెక్స్ట్ జనరేషన్ జాబ్స్ కార్యక్రమంలో సీతం కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీలలో పాల్గొన్న 248 జట్లలో సీతం విద్యార్థులు మొదటి ఐదు స్థానాల్లో నిలిచారు. దీంతో సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి వారిని అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సిఐటియు జాతీయ మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వేపాడ

విశాఖపట్నంలో జనవరి 4న అఖిలభారత మహాసభల్లో భాగంగా ఆర్కె బీచ్‌లో లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామరని ఈ మహా సభకు కార్మిక వర్గమంతా హాజరై విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా పూర్వ కార్యదర్శి చల్లా జగన్ కోరారు. మండలంలోని సోంపురం కూడలి వద్ద మహాసభల సన్నాహక సూచనగా జెండా ఎగురువేశారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గజపతినగరం: సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక దిగు వీధిలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి కోటేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మీ మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశం నలుమూలల నుండి 200 మంది ప్రతినిధులు హాజరవుతారని, జనవరి 4వ తేదీన 3 లక్షల మంది కార్మికులు ఉద్యోగులతో మహా ప్రదర్శన బహిరంగ సభ జరుగుతున్నాయని ఈ మహాసభలకు జిల్లాలో ఉన్న కార్మికులందరూ వాళ్ళ కుటుంబాలతో పాల్గొని జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.కనకరాజు, కృష్ణ, జె.రాము తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ ఐదు రోజులపాటు విశాఖ నగరంలో జరగనున్న సిఐటియు జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం 30వ వార్డులో ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి. గౌరీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకర్రావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో కార్మిక వర్గం పోరాడి 29 లేబర్ చట్టాలు సాధించుకుంటే మోడీ ప్రభుత్వం వాటిని రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ నవంబర్ 21 నుండి అమలు చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. వీటిపై పోరాటంతో పాటు పలు సమస్యలపై చర్చించుకునేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.యుగంధర్, జె.ఏడుకొండలు, ఎం.ప్రసాదు కార్మికులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణ పేట క్వారీల వద్ద, పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సిఐటియు యూనియన్ జెండా ఆవిష్కరణ చేసినట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాల రక్షణకై జరుగు మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణపేట క్వారీ కార్మికులు వై.భాస్కర్. పి.భాస్కర్. ఏ.రామారావు. ఎస్.చిన్నరమణ టి.వెంకటాపురం. టి.కృష్ణ, పి.మహేష్. ఎస్‌కోట ఏరియా హాస్పిటల్ వద్ద జరిగిన కార్యక్రమంలో డి.గంగరాజు, బి.సన్యాసిరావు, ఎం.పోలమ్మ, డి.అప్పలరాజు, ఏ.అప్పారావు, బి.అప్పారావు, ఎం.కృష్ణ, డి.సుగుణ, ఆర్.చంటి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని నగర ఉపాధ్యక్షులు, కళాసీ సంఘం గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక ఎపి బేవరేజెస్ జిల్లా స్టోర్స్ వద్ద జెండా ఆవిష్కరణ జరిపారు. ఈ కార్యక్రమంలో మేస్త్రిలు సత్తి బాబు, కార్తిక్, రామకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఎపి స్టేట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ జిల్లా చైర్మన్, సిఐటియు స్టేట్ కౌన్సిల్ సభ్యులు కాంతారావు కోరారు. సోమవారం హై స్కూల్ అంబేద్కర్ విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘ మండల కార్యదర్శి తామరపల్లి సోములు, సిఐటియు మండల అధ్యక్షులు పొట్నూరు వరలక్ష్మితో పాటు గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: సిఐటియు జాతీయ మహాసభలకు తరలి రావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సంకిలి షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈఐడి ప్యారి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిమ్మ కృష్ణ అధ్యక్షతన కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి, సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మహాసభల పోస్టర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.త్రినాధ్, ఈఐడి ప్యారి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విఆర్‌సి నాయుడు, కోశాధికారి ఎస్.సురేష్, ఉపాధ్యక్షులు ఎం.రాంబాబు, సహాయ కార్యదర్శి ఎం.వెంకటరమణ, కమిటీ సభ్యులు వర్మ, గోవింద్, రాము నాయుడు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: నినాదాలు చేస్తున్న నాయకులు

రేగిడి: జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేష్

బొబ్బిలి: నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

గజపతినగరం: వందనం చేస్తున్న సిఐటియు నాయకులు

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి గోవిందరావు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇంచార్జి డిఎస్‌పి ఆర్.గోవింద రావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్లో ఉన్న వెహికల్స్ డిస్పోజల్ తొందరగా చేయాలని, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డిస్పోజల్ చేయాలని సూచించారు. వీటితో పాటుగా పెండింగ్‌లో ఉన్న కేసులు పురోగతిని, రికార్డులను పరిశీలించి స్టేషన్ ఎస్ఐ గణేష్, సిబ్బంది పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళల రక్షణ, గంజాయి, ఆకతాయిలపై నెల్లిమర్ల పట్నం, పరిసర ప్రాంతాల గ్రామాలపై దృష్టి సారించాలన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉపాధ్యాయులకు నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో సోమవారం నిర్వహించారు. క్రికెట్ పోటీలలో బొబ్బిలిపైన దత్తిరాజేరు ఉపాధ్యాయులు, బాడంగిపైన రామభద్రపురం జట్టు ఉపాధ్యాయులు విజయం సాధించారు. ఉమెన్స్ క్రికెట్‌లో తెర్లాం జట్టుపై బాడంగి ఉపాధ్యాయులు విజయం సాధించారు. డివిజన్ స్థాయి త్రో బాల్ పోటీలో బాడంగి మహిళా ఉపాధ్యాయులు విజయం సాధించారు. బాడంగి మండలం మహిళా ఉపాధ్యాయులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలను పీడీ ఎన్.వెంకటనాయుడు నిర్వహించారు.

యాక్షన్ ప్లాన్ వినియోగించుకోండి

ప్రజాశక్తి - వేపాడ

వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను విద్యార్థులు వినియోగించుకొని శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఇఒలు ఎన్.నాగభూషణరావు, పి. బాలభాస్కరరావు అన్నారు. సోమవారం మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, బక్కునాయుడుపేట, అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అనంతరం డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రాజెక్టు భూముల ఆక్రమణపై పోరాటం

ప్రజాశక్తి- మెంటాడ

గుర్ల గెడ్డ ప్రాజెక్టు ఆక్రమణపై పోరాటం చేస్తామని ప్రాజెక్టు పోరాట సమితి కార్యదర్శి రాకోటి రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 16న గుర్ల గెడ్డ మినీ రిజర్వాయర్ ఆయకట్టు రైతులంతా ఏకమై ప్రాజెక్టు సమీపంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి ప్రాజెక్టుకు సంబంధించిన ఆయా గ్రామాల రైతులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి కోరారు. పట్టణంలోని చీపురుపల్లి వీధిలో సోమవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానా వేయాలని, ఖాళీ స్థలాల్లో చెత్త తీసి పరిశుభ్రం చేయాలన్నారు. కాలువలలో పూడికలు తీయాలన్నారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ, సిబ్బంది ఉన్నారు.

28న బొబ్బిలి కళోత్సవం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో బొబ్బిలి దర్బార్ మహల్ ఆవరణలో ఈ నెల 28న సాయంత్రం బొబ్బిలి కళోత్సవం పేరుతో ప్రాచీన జానపద కళల ప్రదర్శన నిర్వహించనున్నామని నిర్వాహకులు కరుణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన జాలారి బాగోతం, తప్పెటగుళ్ళు, కోలాటం, చెక్కభజన, బిందెల డాన్స్, బుర్రకథ, జానపదములు మొదలగు కళలను భావితరాలకు అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని కళాబంధు బేబీ నాయన చెప్పారని తెలిపారు. బొబ్బిలి మల్టీ టాలెంట్స్ గ్రూప్ నిర్వాహకులు జి.కరుణకుమార్ డాన్స్ మాస్టర్ మీసాల చినగౌరినాయుడు, చప్ప అప్పలనాయుడు, నాగరాజు, చిన్నికృష్ణ, తాడ్డి త్రినాధ, టి.వెంకటరమణ పర్యవేక్షణలో మన వీర బొబ్బిలిలో విభిన్నంగా, విలక్షణంగా, వినూత్న దర్శనలు జరుగుతాయని ఆయన వివరించారు.

ప్రచారం చేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది

విద్యుత్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి - వంగర

విద్యుత్తు వాడుకునే విధానంపై ఎఇ వి.సాంబశివరావు ఆధ్వర్యంలో మండలంలో పలుచోట్ల ప్రజలకు కరపత్రాలు పంచుతూ సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని, లైట్లు, ఫ్యాన్లు ఇస్త్రీ పెట్టెలు, ఎలక్ట్రిక్ కుక్కర్, ఫ్రిడ్జ్ వాడకం, ఏసి గీజర్ తదితర ఎలక్ట్రికల్ పరికరాలు పొదుపుగా వాడుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొదుపుగా వాడుకుంటే విద్యుత్తు ఎంతో ఆదా అవుతుందని దానివల్ల డబ్బులు కూడా ఖర్చు తగ్గుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది చిన్నారావు, శంకర రావు, గణేష్, రమేష్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - భోగాపురం

కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ స్వరూపారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించాలని, ఎస్‌డబ్ల్యూపి షెడ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు సక్రమంగా చేరేలా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.గాయత్రీ, మండల జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- రామభద్రపురం

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ అనిత తెలిపారు. మండలంలోని పాతరేగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఈ సెంటర్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న తనంలో వివాహం చేయడం వల్ల బాలికలు ఎంతో నష్టపోతారన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు వివాహాలు చేస్తే 366 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలకు ఏ సమస్య వచ్చినా 1098, 181, 112, 1930 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన బంగారం రికవరీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని రామస్వామి పేటలో చోరీకి గురైన ఐదున్నర తులాల బంగారం, వావిలపాడులో చోరీకి గురైన ఒకటిన్నర తులాల బంగారం రికవరీ చేసి పిల్ల నూకరాజు అనే దొంగను అదుపులోకి తీసుకున్నామని రూరల్ సిఐ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వల్లంపూడి పోలీసు స్టేషన్‌లో ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ వారంలో జరిగిన ఈ రెండు దొంగతనాలకు కారణమైన నూకరాజును కొంపల్లి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రానున్న పండగ రోజుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్వగ్రామాలకు వెళితే విలువైన వస్తువులను తమ వెంట తీసుకుని పోవాలని అపరిచితులు ఎవరైనా కనపడితే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఐ సుదర్శన్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్నా పింఛను రావడం లేదు

◆ మంత్రి ముంగిట పింఛనర్ల ఆవేదన ◆ సమస్యలపై వినతుల వెల్లువ ◆ పోలవరం డిజైన్ మార్చాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి- గంట్యాడ

అర్హత ఉన్నా తమకు పింఛన్లు అందడంలేదని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తమ ఆవేదనను మంత్రి శ్రీనివాస్ ముందు వెళ్లగక్కారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రాలను అందించారు. తమకు 60 సంవత్సరాలు దాటినప్పటికీ వృద్ధాప్య పింఛను ఇంత వరకూ అందలేదని కొంత మంది, భర్త మృతి చెంది సంవత్సరం కావస్తున్నా ఇంత వరకూ వితంతు పింఛను అందలేదని మరికొంత మంది మంత్రికి విన్నవించారు. తాటిపూడి గ్రామానికి చెందిన తాంద్రంగి పేరమ్మ భర్త చనిపోయి మూడు సంవత్సరాల అయినప్పటికీ ఇంతవరకు పింఛను రాలేదని, ఆర్ వసంత గ్రామానికి చెందిన చలుమూరి గంగమ్మ భర్త చనిపోయి 40 సంవత్సరాలు అయిందని, కొద్ది సంవత్సరాలు వితంతు పింఛను వచ్చి ఆగిపోయిందని, ఇప్పుడు తనకి 86 సంవత్సరాలు అయిందని ఇంతవరకు వితంతువు పింఛను అందకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. కొర్లాం రెవెన్యూకు సంబంధించిన 2.50 ఎకరాల భూమి గ్రీన్ ఫీల్డ్ హైవేలో కలిసిపోయిందని ఇంతవరకు నష్టపరిహారాన్ని చెల్లించలేదని పల్లె వెంకటరావు, కరక శ్రీనివాసరావుతో పాటు మరి కొంతమంది రైతులు వినతినిచ్చారు. గుర్ల, నెల్లిమర్ల మండలాలకు సంబంధించిన రామతీర్థ ప్రాజెక్ట్ ఉద్యోగులకు గత కాంట్రాక్టర్ రూ.9,500 జీతం ఇచ్చే వారని కాంట్రాక్టర్ మారిన తర్వాత రూ.7,500 జీతం ఇస్తున్నారని ఈ విషయంపై అడుగుగా నచ్చితే పని చేయండి లేకుంటే మానేయండని సమాధానం చెబుతున్నారని దీన్ని పరిష్కారం చేసి తమ జీవితాలను నిలబెట్టాలని మంత్రికి ఉద్యోగులు వినతి పత్రాన్ని అందజేశారు. బోనింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. గంట్యాడలోని శిథిలావస్తుల ఉన్న భవనంలో గ్రంథాలయం నడపడం వల్ల పాఠకులు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇప్పటికీ భవనానికి నిధులు రావడం లేదని నూతన భవన నిర్మాణానికి తోడ్పడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి లక్ష్మి గంట్యాడ గ్రంథాలయ అధికారి శ్రీనివాసు వినత పత్రాన్ని అందజేశారు. ప్రజల నుంచి మంత్రి ఈ సందర్భంగా 152 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పీరుబండి హైమావతి, తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, నాయకులు అల్లు విజయకుమార్, రంది చిన్నరామునాయుడు, గంట్యాడ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు బూడి అప్పలనాయుడు, (గాంధీ), వివిధ శాఖల అధికారులు, మండల కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్

పోలవరం కాలువ డిజైన్ మార్చాలని వినతి

పోలవరం నుంచి వచ్చే కాలువకు సంబంధించిన డిజైన్ మార్చుతామని ఎన్నికల సమయంలో లోకేష్ హామీ ఇచ్చారని ఇంత వరకూ హామీని నెరవేర్చలేదని మంత్రి దృష్టికి గంట్యాడ, బొండపల్లి రైతులు తీసుకొచ్చారు. ఎత్తు పోతల పథకం కాకుండా గ్రావిటీ ద్వారా నీరు అందించాలని వినతి పత్రాన్ని అందించారు.

బానాది వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

లింకు రోడ్ల నిర్మాణానికి పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణానికి సోమవారం పంచాయతీరాజ్ డిఇ అప్పారావు పరిశీలన చేశారు. ఆతవ గ్రామం నుండి బానాది గ్రామానికి, జగ్గయ్యపేట రోడ్డు నుండి కొత్త సింగరాయి గ్రామానికి మెటల్ రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణానికి పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ఈఈ అలెక్స్, పిటిపియుటి ఎఇ జి.మానస, టిడిపి మండల అధ్యక్షుడు గొంప వెంకట రావు, ఆతవ గ్రామకమిటీ టిడిపి నాయకులు కోటాన బాలకృష్ణ, కొటాన ప్రసాదు, బాణాది గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడివానివలసను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రామభద్రపురం

మండలంలోని కోటశిర్లాం పంచాయతీ పరిధిలోని పాడివానివలస గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం ఎంపిడిఒ రత్నంకు వినతిపత్రం అందించారు. కోటశిర్లాం పంచాయతీ సర్పంచ్ ప్రతినిది తాడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరంతా మాట్లాడుతూ కోటశిర్లాంకు 3కిలోమీటర్ల దూరంలో మధుర గ్రామంగా పాడివానివలస ఉందని, సుమారు వెయ్యి మంది జనాభా గల ఈ గ్రామంలో గిరిజనులు, బీసీలు అధికంగా ఉన్నారని తెలిపారు. ఏ పని చేసుకోవాలన్నా కోటశిర్లాం గ్రామానికి వెళ్లడం చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ప్రభుత్వం స్పందించి పాడివాని వలసను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో వార్డు మెంబరు మాదిరెడ్డి అప్పలనాయుడు, గ్రామ యువజన సంఘం నాయకుడు బండారు నాగరాజు పాల్గొన్నారు.

ఎనుబరువును కూడా...

రావివలస పంచాయతీ పరిధిలో ఉన్న ఎనుబరువు గిరిజన గ్రామాన్ని కూడా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని మాజీ జెడ్‌పిటిసి బోయిన లూర్థమ్మ ఆధ్వర్యంలో తహశీల్దార్ అజరఫీజాన్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఇటీవల కొత్త పంచాయతీలకు అవకాశం కల్పిస్తుండడంతో ఈ గ్రామాన్ని కూడా రావివలస నుంచి విడదీసి ఎనుబరువు గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావివలస మాజీ సర్పంచ్ అడారి జయరావు, నందిజన్ని గంగరాజులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతినిస్తున్న నాయకులు

పెదమేడపల్లిలో మెరిసిన క్రీడా కుసుమం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో సాధారణ వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టిన కొయినాన శ్రావణి వివిధ క్రీడల్లో పలు పథకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతోంది. తండ్రి కృష్ణ, తల్లి సన్యాసమ్మ, అన్నయ్య గౌరిశంకర్‌లకే కాకుండా గ్రామానికి, పాఠశాలకు కూడా ఎంతో పేరు తెస్తూ దూసుకుపోతోంది. ఈ నెల 11,12,13 తేదీలలో ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో జరిగిన అథ్లెటిక్స్, జావలిన్ త్రో విభాగంలో కాంస్య పథకాన్ని కైసం చేసుకుందని కోచ్ చింతల రాజేష్ తెలిపారు. శ్రావణి ఆరో తరగతి నుంచి ఆదర్శ పాఠశాలలో చదువుతూ కబడ్డీ, జూడో అథ్లెటిక్స్ వంటి విభాగాల్లో ఎన్నో బహుమతులు సాధించిందని, రాష్ట్ర, జాతీయ స్థాయికి కూడా ఆడిందని ఈ క్రీడా కోటాలోనే ఎన్‌సిసిలో కూడా స్థానం సంపాదించి ప్రస్తుతం మహారాజా కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ తరపున గత రెండు సంవత్సరాల నుంచి జూడో అథ్లెటిక్స్ విభాగాల్లో రాణించడం ఎంతో గర్వకారణమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి 3శాతం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. ఇంకా మరెన్నో క్రీడలలో పాల్గొని ఎన్నో మెడల్స్ సాధించాలని గ్రామ ప్రజలు పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ శ్రావణిను అభినందించారని తెలిపారు.

పతకాలతో శ్రావణి

బిసి కాలనీ బాధలు తీర్చండి ప్రభో..!

ప్రజాశక్తి - జామి

మండల కేంద్రమైన జామి బిసి కాలనీ ప్రజల బాదలు తీర్చి, మౌలిక సదుపాయలు కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కి విన్నవించుకున్నారు. ఈ మేరకు జామి గ్రామానికి చెందిన నాయకులు కొత్తలి అంజి, మాజీ వార్డు సభ్యులు బొట్ట రమణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరెట్ ప్రధాన గేటు ముందు నిరసన తెలియజేసి, సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బిసి కాలనీలో 300 మందికి పైగా నివాసముంటున్నారని, తాగునీరు సరిగా అందడం లేదని వాపోయారు. కాలనీకి ఆనుకుని ఉన్న జెఎ ఛానల్ అపారిశుద్ధ్యం వల్ల కాలనీ వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. రహదారి సౌకర్యం సరిగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి, చాందిని దేవి, దివ్య, కృణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన

నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

Government of Andhra Pradesh
APEWIDC., Vizianagaram Division

NIT No.2/EE/HD/2025-26/ to 6/2025-26/ dt. 15.12.2025.

1. Tenders invited from Registered Civil Contractors for NIT No. 2/EE/HD/2025-26/ to 6/2025-26/ dt. 15.12.2025 for 5 Work APSWREI Society of Rs. 73.00 Lakhs.

Last date for receipt of Tenders 22.12.2025 up to 5.00 PM.

Note:- for further details can be viewed at **http// Tender "e"procurement.gov.in or Contact: 9490461424.**

Executive Engineer
APEWIDC., Vizianagaram.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?

నేడు వేపాడ మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలెందుకని పలువురు అధికారులను ప్రశ్నిస్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ అరిగిపాలెం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించాలని సభ్యులు కోరినా పరిష్కరించలేదు. ఎంపిపి స్వయంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో సాంస్కృతిక కళావేదిక, పేరెంట్స్ వెయిటింగ్ హాలు నిర్మిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేసి నాలుగేళ్లవుతున్నా నిధులు మంజూరు చేయలేదు. బక్కు నాయుడుపేట జంక్షన్ నుండి 556 మీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని చెప్పి నేటికీ ప్రతిపాదనలకే పరిమితం చేశారు తప్ప నిధులు మంజూరు చేయలేదు. సింగరాయి ఎస్‌సి కాలనీ వాసులకు శ్మశానం వద్ద బోరు ఏర్పాటు చేయమని కోరినప్పటికీ ఏర్పాటు చేయలేదు. బానాది గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రతి సమావేశంలోనూ ఎంపిటిసి గొంప తులసీ అడుగుతున్నా నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. సమస్యలు పరిష్కారం మాట అటుంచితే సమావేశంలో అధికారులు ప్రజాప్రతినిధులు మధ్య బిల్లులు గొడవ తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్న వాదన వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మరోసారి ఇవే సమస్యలు తెరపైకి వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించడంతో పాటు నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రారంభం కాని అరిగిపాలెం పంచాయతీ భవనం

గరుగుబిల్లిలో క్లోరినేషన్

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లిలో సోమవారం సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో బోరు బావుల్లో క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవాల అప్పలనాయుడు, ఎంపిటిసి చందక చిరంజీవి నాయుడు, సచివాలయ కార్యదర్శి గౌరి నాయుడు, అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.A. /2025 in O.S. No. 327/2023

BETWEEN:
The Canara Bank, reptd., by its Manager, Main Branch-II (13581), D.No.17-5-10, Ratnam Plaza, College Road, Near Three Lamps Junction., Vizianagaram, A.P.-535 002.
.......Petitioner/Plaintiff.

AND:
Sri. Barla Krishna Rao & Another.
......Respondents/Defendants.

To
1) Sri. Barla Krishna Rao S/o late Chandra Rao, Hindu, aged 60 years, Business, R/o D.No.21-3-19, Ippili Veedhi, Near Nallamma Thalli Chettu, Khadar Nagar, Vizianagaram -2.
2) Sri. Palla Srinivasa Rao S/o Kanaka Raju, aged 57 years, Business, R/o D.No.12-5-105, Respondents/Defendants. Yadava Street, Kotha Street, Vizianagaram-2.

NOTICE

Please take notice that the Plaintiff-Bank filed the above O.S.327/2023 against both of you seeking recovery of the suit amount due to the plaintiff-Bank, which stands posted to **18/12/2025** for your appearance and on which date, both of you should appear before the above honourable Court in person or through an Advocate and if fail to appear on that day at **10-30 A.M.,** the matter will be heard and decided Exparte.
As per the orders of the Honourable Court.

P. VENUGOPALA RAO
Advocate, Vizianagaram

మహారాజశ్రీ కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 15/2025

Between:
కోనేటి వరలక్ష్మి మరియు వగైరాలు
...వాదులు
And : కోనేటి అమ్మాజీ మరియు వగైరాలు
...ప్రతివాదులు

To
D7 : కోనేటి వీరేశలింగం S/o బంగార్రావు (లేటు) R/o చందులూరు గ్రామం, లక్కవరపుకోట మండలం, విజయనగరం జిల్లా.
D9 : సతివాడ రమణమ్మ w/o సతీష్, D/o (లేటు) బంగార్రావు R/o చందులూరు గ్రామం, లక్కవరపుకోట మండలం, విజయనగరం జిల్లా.
D10 : కోనేటి అమ్మాజీ, D/o బంగార్రావు R/o చందులూరు గ్రామం, లక్కవరపుకోట మండలం, విజయనగరం జిల్లా.

దావా పరిహారం నిమిత్తం (ప్లెయింటు కాపీ జతపరచడమైనది) మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందు వలన **2025వ సం॥ 12వ నెల 31వ** తారీఖున **పగలు 10-30గంటలకు** స్వతహాగా లేక సరి అయిన భోగట్టా యివ్వబడిన వకీలుగారి ద్వారాగా లేక సరి అయిన ఏజెంటు మూలముంగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యిందు వల్ల మీరు ఆజ్ఞాపించడమైనది. మీ ప్రతిపాదమునకు ఆధారంగా ఉద్దేశించి యుండే దస్తావేజుల న్నింటినీ నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆ రోజు హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించు టమగునని మీర తెలుసుకోవలసినది.

సిహెచ్.ఆర్.సిహెచ్ ప్రసాద్
Advocate for Plaintiffs
9440070174